

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన

దర్శిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగాయి.

- 8లో..



ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలి

సాధారణ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 31/22

వాతావరణం

ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జిగా బూచేపల్లి



దర్శి: వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి 2004 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సూచనల మేరకు 2009 ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ సీపీలో కొనసాగుతూ వచ్చారు. సంవత్సరం ముందుగానే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగనన్న వెంట నడిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైనా నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి నియోజకవర్గాన్ని కనిపెట్టుకున్నారు. ఆ తరువాత తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి అనారోగ్య కారణాలతో 2019 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అయితే పార్టీ నిలబెట్టిన మద్దిశెట్టి వేణుగోపాల్‌ను 39 వేల పై చిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేశారు. దర్శితో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో టీజేఆర్ సుధాకర్‌బాబును కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించారు. వైఎస్సార్ సీపీ క్యాడర్‌ను కాపాడుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. దర్శి జెడ్పీటీసీగా శివప్రసాద్‌రెడ్డి తల్లి బూచేపల్లి వెంకాయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూచేపల్లి కుటుంబం పార్టీకి చేసిన సేవలను గుర్తించిన సీఎం బూచేపల్లి వెంకాయమ్మను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ని చేశారు. ఆ తరువాత జిల్లాతో పాటు దర్శి, సంతనూతలపాడు రెండు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులకు అండగా ఉంటూ వారి అవసరాలు తీరుస్తూ వారి అభిమానం పొందుతున్నారు. ఈ తరుణంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు బూచేపల్లి అభిమానులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమీక్ష సమావేశం

- హాజరు కానున్న రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి

కొండపి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమీక్ష సమావేశం ఈ నెల 12న శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు జారీ

ఒంగోలు టౌన్: పీసీపీఎన్‌డీటీ యాక్టు 1996 ప్రకారం రిజిస్టర్ రెన్యువల్ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై కలెక్టర్ కన్నెర్ర చేశారు. ఈ మేరకు జిల్లాలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒంగోలు నగరంలోని ప్రగతి నర్సింగ్ హోం, మార్కాపురంలోని కందుల ఓబులరెడ్డి ఆస్పత్రులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ స్కాన్ సెంటర్లు విధిగా రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేసి ఆస్పత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కాంట్రాక్ ఉద్యోగుల మోసపోద్దు

వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అర్హులందరినీ రెగ్యులైజేషన్ చేయనున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు తెలియజేశారని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ క్రమంలో ఎవరైనా మేము రెగ్యులైజేషన్ చేయిస్తామంటూ డబ్బులు అడిగితే ఎలాంటి పరిస్థితులోనూ ఇవ్వవద్దని అప్రమత్తం చేశారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

కరువు వాకిట్లో సుస్థిర బాట

సరిగ్గా ఐదేళ్ల కిందట జిల్లాలో ఎటుచూసినా కరువుఛాయలే..నాటి పాలకులు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేశారు. సాగు, తాగునీటి కోసం ప్రజలు, రైతులు అల్లాడేవారు. సరైన వైద్యం అందక చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో సుస్థిరబాటకు పునాదులు పడ్డాయి నవరత్నాలతో సంక్షేమం.. అభివృద్ధి పనులతో నవశకం ఆరంభమైంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకు వచ్చింది. పోలవరం తర్వాత వెలిగొండ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దాదాపు పనులు పూర్తయ్యాయి. నాడు వైద్యం గగనమైన పశ్చిమం నేడు మెడికల్ హబ్‌గా మారుతోంది. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతంలో కృష్ణాజలాలు పరుగులు తీసేలా పలు తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. రైతులకు అవసరమై అన్ని సేవలు ఆర్బీకే ద్వారా అందుబాటులోకి తెచ్చింది. కష్టకాలంలో నేనున్నాను అంటూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నియోజకవర్గానికి సరాసరిన రూ. 2వేల కోట్లు వెచ్చించి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రుల రూపు రేఖలు మార్చేశారు. జిల్లా ప్రగతిలో తనదైన ముద్రవేసుకున్నారు.



మార్కాపురం మండలం గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఉన్న ఇన్‌టెక్‌వెల్

- సంక్షేమ, అభివృద్ధికి కేరాఫ్ సచివాలయాలు...
- జిల్లాలో లక్షల మందికి వేల కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ
- నవరత్నాల ద్వారా రూ.17,934.67 కోట్లు పేదలకు అందజేత
- రైతు భరోసాకు రూ.1299.37కోట్లు, అమ్మఒడికి రూ. 943.98కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి
- ఆరోగ్యశ్రీ ద్వారా 1,47,366 మందికి రూ.372.81 కోట్లతో ఉచిత వైద్య సేవలు
- సరాసరి నియోజకవర్గానికి రూ.2000కోట్లు పైగా సంక్షేమ ఫలాలు అందచేత



కనిగిరి చెరువు అభివృద్ధి పనులు

ఒంగోలు అర్బన్: తెలుగుదేశం పాలనలో జిల్లాలో అభివృద్ధి ఊసే కనిపించేది కాదు. జిల్లా అన్ని రంగాల్లో జిల్లా వెనుకబాటు తనమే కనిపించేంది. అన్ని మండలాల్లో కరువు చిత్రాలే దర్శనమిచ్చేవి. అరకొరగా ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరికొన్ని పనులకు సంబంధించిన నిధులను ఆ పార్టీ నాయకులు మింగి ప్రజల్ని గాలికొదిలేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుతో జిల్లా అభివృద్ధి పథం వైపు దూసుకుపోతోంది. టీడీపీ హయాంలో నిలిచిపోయిన నిర్మాణాలను సైతం పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారు. గాంధీ కలలు కన్న స్వరాజ్యాన్ని స్థాపించి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతో జిల్లాలో దాదాపు 10 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు 41 లక్షలకు పైగా సేవలు వివిధ శాఖలకు సంబంధించి ప్రజలకు అందాయి. కరోనా వంటి విపత్తులు వచ్చినా సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలు చేస్తూనే ఉన్నారు.



- మార్కాపురం మెడికల్ కాలేజీకి రూ.475 కోట్లు, కోట్లాది రూపాయలతో జీజీహెచ్ అభివృద్ధి
- నాడు-నేడు ద్వారా 1992 పాఠశాలల అభివృద్ధికి రూ.369.16కోట్లు
- 531 సచివాలయాల సొంత భవనాలకు రూ.231కోట్లు, 484 ఆర్‌బీకేలకు రూ. 115.87కోట్లు, 366 హెల్త్‌క్లినిక్‌లకు రూ.75.92కోట్లు

నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు

నవరత్నాల ద్వారా సచివాలయాల వారీగా అర్హులైన పేదలకు మొత్తం రూ.17,934.67 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. నియోజకవర్గానికి సరాసరి రూ.2వేల కోట్లకు పైగా లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు చేరింది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా జిల్లాలో 2,86,256 మందికి రూ.1299.37 కోట్లు, అమ్మ ఒడి పథకం కింద 2,09,776 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.943.98 కోట్లు నగదు చేరింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 1,47,366 మందికి రూ.372.81కోట్ల మేరకు వైద్య సేవలు ఉచితంగా అందాయి.

రైతుకు అండగా ..

రైతుకు ఏ ఆపద వచ్చినా నేనున్నాంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. రైతులకు సకాలంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించడంతో పాటు ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు విశిష్టమైన సేవలు అందించడంలో ప్రభుత్వం సఫలమైంది.



కనిగిరి మండలం బల్లిపల్లి రైతు భరోసా కేంద్రం



సంక్షేమ ఫలాలు ఇలా..

వైఎస్సార్ ఫించన్ కానుక ద్వారా జిల్లాలో 2,80,452 మందికి ప్రతి నెల రూ.78 కోట్లు అందజేస్తున్నారు. జగనన్న విద్యా దీవెన ద్వారా 3,36196 మంది విద్యార్థులకు స్కూలు యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు ఉచితంగా అందచేశారు.

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	2,86,256	1299.37
వైఎస్సార్ పింఛన్ కానుక	2,86,075	4065.45
వైఎస్సార్ సున్నా వడ్డీ	4,84,524	203.3
వైఎస్సార్ చేయూత	1,19,314	534.58
వైఎస్సార్ ఆసరా	4,10,040	884.68
వైఎస్సార్ వాహనమిత్ర	10,176	40.72
వైఎస్సార్ నేతన్న నేస్తం	667	24.24
వైఎస్సార్ కాపు నేస్తం	8,317	35.82
ఈబీసీ నేస్తం	39,409	112.91
జగనన్న చేదోడు	14,527	39.98
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1,47,366	372.81
జగనన్న వసతి దీవెన	54,535	104.6
జగనన్న విద్యా దీవెన	55,930	41.4
వైఎస్సార్ మత్స్యకార భరోసా	5,286	41.17
జగనన్న అమ్మ ఒడి	2,09,776	943.8
జగనన్న తోడు	1,81,180	198.66



పాదిలి సామాజిక ఆరోగ్య కేంద్రం



దర్శి మండలం బొట్లపాలెం జగనన్న పాలవెల్లువ కేంద్రం

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసాకేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలను కోట్లాది రూపాయలతో సొంత భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. 531గ్రామ సచివాలయాలు రూ.231.52 కోట్లతో నిర్మాణం చేపట్టగా ఇప్పటికే 422 భవనాలు పూర్తయ్యాయి.

రైతుభరోసా కేంద్రాలు 484 భవనాలు నిర్మాణాలు రూ.115.87 కోట్లతో చేపట్టగా వాటిలో 409 భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 366 భవనాలు రూ.75.92 కోట్లతో చేపట్టగా వాటిలో 248 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. దీనికి అనుబంధంగా ప్రభుత్వ ఆస్పత్రికి కూడా రూ. కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. వాటర్‌గ్రిడ్ పథకంలో భాగంగా గొట్టిపడియ వద్ద ఇన్‌టెక్ వెల్ నిర్మాణంలో ఉంది.



గిద్దలూరులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన ఒంగోలు బండ్లమిట్ట పాఠశాల

పేద పిల్లలకు ఉన్నతమైన విద్య అందించడమే లక్ష్యం

పేద పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు-నేడు పథకం కింద జిల్లాలో రెండు దశల్లో కలిపి 1174 ప్రభుత్వ పాఠశాలలు రూ.369.16 కోట్లతో మరమ్మతులు, నూతన నిర్మాణాలతో రూపురేఖలు మార్చేశారు. మొదటి దశలో 1015 పాఠశాలలకు రూ.209.42కోట్లు, రెండో దశలో 977 పాఠశాలలకు రూ.159.74 కోట్లతో ఆధునీకీకరణ చేశారు. విద్యార్థులకు బూట్లు, యూనిఫారం, పుస్తకాలతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అమ్మఒడి పథకం ద్వారా పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేలు నగదు జమ చేస్తూ కుటుంబాలకు అండగా నిలస్తున్నారు.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

- ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల రుణ సహాయం
- 8వ విడతలో జిల్లాలో 18,166 మందికి రూ.19.22 కోట్ల రుణాలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



జగనన్న తోడు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తిదారులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం తోడుగా ఉంటుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. జగనన్న తోడు పథకంలో భాగంగా 8వ విడత లబ్ధిదారులకు రుణాలు, వడ్డీ మాఫీ నగదు మంజూరు చేస్తున్న నేపథ్యంలో గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. అనంతరం ఈ పథకం లబ్ధిదారులకు రుణాల పంపిణీ, వడ్డీ రాయితీ బ్యాంకు చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా ప్రతి ఒక్కరికీ బ్యాంకు ద్వారా రూ.10వేల రుణ సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. తిరిగి చెల్లించిన వారికి అదనంగా రూ.1000 కలిపి రూ.11వేలు రెన్యువల్ రుణం కింద ఇస్తున్నట్లు తెలిపారు. 8వ విడతలో జిల్లాలో 18,166 మందికి రూ.19.22 కోట్ల రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విడతలో 24,171 మంది లబ్ధిదారులకు రూ.46.95 లక్షల వడ్డీ రాయితీ కూడా జమ చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాలో 79,043 మంది లబ్ధిదారులు రెగ్యులర్‌గా రుణం పొందుతున్నట్లు వివరించారు. అన్నీ విడతల్లో కలిపి ఇప్పటి వరకు 1,94,867 మందికి రూ.197.5 కోట్ల రుణాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. 2,18,460 మందికి రూ.4.70 కోట్ల వడ్డీ రాయితీ లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనోపాధి పొందాలని కోరారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు హర్షనీయమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చిరు వ్యాపారులకు చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

కుటుంబ పోషణకు పూల వ్యాపారం చేసుకునే నాకు రుణ సహాయం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఇద్దరు బిడ్డలు, కుటుంబ పోషణ అవసరాల కోసం పూల వ్యాపారం ప్రారంభించాను. గతంలో అధిక వడ్డీతో బయట అప్పు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాను. చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ప్రవేశపెట్టిన జగనన్న చేదోడు ఎంతగానో ఉపయోగపడుతుంది. మా వంటి చిరు వ్యాపారులకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– లక్ష్మీ తిరుపతమ్మ, వజ్జిరెడ్డిపాలెం, కొత్తపట్నం మండలం

బాబుకు వారసత్వమే పెద్ద శాపం



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్దార్థరెడ్డి

దర్శి: చంద్రబాబుకు వారసత్వమే పెద్ద శాపమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి అన్నారు. లోకేష్ సమర్థుడైతే చంద్రబాబు పవన్ ఎందుకు అడుక్కుంటాడు, పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సాయం కోరాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వారసత్వం అంటే తండ్రికి తగ్గ తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. దర్శిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ ఎవరితో ఒకరితో పొత్తు పెట్టుకునే ఎన్నికలకు వెళతారని, ఒక్కరే ఎన్నికలకు వెళ్లే ధైర్యం ఆయనకు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 20 వేల మందితో పులివెందులలో పాదయాత్ర ప్రారంభిస్తే.. విశాఖపట్టణానికి వెళ్లే సరికి రెండు లక్షల మంది అయ్యారన్నారు. అదే నారా లోకేష్ కుప్పంలో 10 వేల మందితో పాదయాత్ర ప్రారంభిస్తే విశాఖపట్నం పోయే సరికి వెయ్యి మంది కూడా లేరన్నారు. టీడీపీ నేతలు టీ కొట్ల వద్ద వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాదని చెప్పుకోవడం తప్ప అధికారంలోకి ఉన్నప్పుడు చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. రూ.2.50 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేసిన జగన్‌మోహన్‌రెడ్డి కావాలో ప్రజలకు రూపాయి కూడా ఇవ్వకుండా దోచుకున్న చంద్రబాబు కావాలో తేల్చుకోవాలన్నారు. నీరు-చెట్టు పేరుతో దోచుకున్నందుకా, జన్మభూమి కమిటీ అరాచకాలు చూశా..అమరావతి రాజధాని పేరుతో లక్షల కోట్లు దోచుకున్నందుకా..చంద్రబాబు రావాలని కోరుకోవాలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 15 వేల పంచాయతీల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లకు ఎన్నో వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి ప్రపంచంలో మరెక్కడున్నా వారికే ఓటేయవచ్చన్నారు. ఓటనేది అడిగేలా ఉండాలే గానీ అడుక్కునేలా ఉండకూడదన్నారు. అందరి జీవితాలు మార్చే జగన్‌మోహన్‌రెడ్డి కావాలో అబద్ధాలు చెప్పి మోసం చేసే చంద్రబాబు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్రకే వేల మంది జనాలు వస్తున్నారని ఆరోపిస్తున్నారని, మరో 15 రోజుల్లో జగనన్న జనాల్లోకి వస్తున్నారని, అప్పుడు స్పందన చూస్తే టీడీపీ వారికి మాట్లాడటానికి ఏం ఉండదని సవాల్ విసిరారు. ప్రజల జీవితాలు మార్చాలని నవరత్నాలు ప్రవేశపెట్టి పూర్తిస్థాయిలో అమలు చేశారన్నారు. చంద్రబాబు తన శక్తి సామర్థ్యాలపై ఆధారపడలేదని పవన్‌కళ్యాన్, బీజేపీ పెద్దపై ఆధారపడ్డారని విమర్శించారు. దేశంలో ప్రధాన శత్రువులైన బీజేపీని ఒక సంకలో, కాంగ్రెస్‌ను మరో సంకలో పెట్టుకుని నడ పాలనుకోవడమే చంద్రబాబు గొప్పతమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జరుగుమల్లిలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: మండల కేంద్రమైన జరుగుమల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం కలెక్టర్ స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. జిల్లా అధికారులంతా స్పందన కార్యక్రమానికి హాజరవుతారని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన

- సీనియర్ విభాగం పోటీల్లో పాల్గొన్న 16 జతల ఎడ్లు
- ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించిన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి
- ఎడ్ల యజమానులను సత్కరించిన మంత్రి మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి
- ఎడ్ల పోటీలను ఆసక్తిగా తిలకించిన పశుపోషకులు, అభిమానులు



సభలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



హోరాహోరీగా సాగుతున్న పోటీలను తిలకిస్తున్న పశుపోషకులు, అభిమానులు

దర్శి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన సీనియర్ విభాగం పోటీలు రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఎడ్ల జతల యజమానులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఘనంగా సత్కరించారు. పోటీల ప్రారంభానికి ముందుగా ప్రజలనుద్దేశించి బైరెడ్డి ప్రసంగించారు. తండ్రి ఆశయాలు కొనసాగించాలనే తపనతో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. పేదల సంక్షేమాన్ని ఆశించే శివప్రసాద్‌రెడ్డి లాంటి వ్యక్తులను గెలిపించుకుంటేనే అందరికీ మంచి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో జగనన్నను దర్శిలో శివన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, దర్శి, తాళ్లూరు మండల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, జెడ్పీటీసీ సభ్యులు రాజయ్య, మారెడ్డి అరుణ, చుండూరి రవి, కస్తూరిరెడ్డి, వాగ్యానాయక్, దద్దాల నారాయణ, వేమా శ్రీనివాస్, నుసుం నాగిరెడ్డి, రత్నరాజు, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, పోశం మధుసూదన్ రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, పుల్లారెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూ కేటగిరీ విజేతలు వీరే..

జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో విజేతలకు బహుమతులను బుధవారం అర్ధరాత్రి అందజేశారు. న్యూకేటగిరీ విభాగంలో 18 జతలు పోటీపడ్డాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరెడ్డి ఎడ్ల జత 5050.2 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.లక్ష గెలుపొందాయి. ముండ్లమూరు మండలం గన్నపాలెం గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత యూఎస్ఆర్ 4856.3 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.80 వేలు, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు ఆర్ఆర్ బుల్స్, గుంటూరు జిల్లా అమరావతి మండలం మునుగోడుకు చెందిన పోపూరి శ్రీనివాసరావు సంయుక్త ఎడ్ల జత 4818.6 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.70 వేలు, నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 4801.6 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.60 వేలు, కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన డీవీకే బుల్స్ లాయర్ కృష్ణ ఎడ్ల జత 4545.11 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.50 వేలు, కడప జిల్లా వీరపనాయునిపల్లి మండలం కీర్తిపల్లి గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్ యాదవ్, పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లె గ్రామానికి చెందిన బొంబణబోయిన చిన్నరాయుడు యాదవ్ సంయుక్త ఎడ్ల జత 4521.6 అడుగులు లాగి 6వ బహుమతి రూ.40 వేలు, నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎద్దుల 4508.5 అడుగులు లాగి 7వ బహుమతి రూ.30 వేలు, జోగులాంబ గద్వాల్ జిల్లా గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రెప్ప ఎడ్ల జత 4406.9 అడుగులు లాగి 8వ బహుమతి రూ.20 వేలు, గుంటూరు రూరల్ మండలం లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశిరావు ఎడ్ల జత 4384.11 అడుగులు లాగి 9వ బహుమతి రూ.10 వేలు గెలుపొందాయి. విజేతలకు బహుమతులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో కలిసి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి



ఎడ్ల యజమానులను సత్కరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలి

- ప్రమాణికాబద్ధమైన విధివిధానాలు అమలు చేయాలి
- పోలీస్ అధికారులకు ఎస్పీ మలికా గర్గ్ దిశానిర్దేశం
- సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



సమావేశానికి హాజరైన జిల్లాలోని పోలీస్ అధికారులు

ఒంగోలు సబర్బన్: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీ గురువారం డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు నిర్వర్తించాల్సిన ప్రమాణికాబద్ధ విధి విధానాలు, అందుకు అమలు చేయాల్సిన నిబంధనల నియమావళి, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై లోతుగా అధ్యయనం చేశారు. ఎన్నికల కోసం కీలకమైన భద్రతా చర్యలు, బందోబస్తు కోసం చేపట్టాల్సిన అంశాలపై 3వ బ్యాచ్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రవర్తనా నియమావళి, ఎన్నికలకు సంబంధించిన చట్టాలు, నేరాలు, ఎన్నికల్లో నగదు, మద్యం అక్రమ రవాణా, అక్రమ ఆయుధాలు, ఇతర ప్రభావిత వస్తువులకు అడ్డుకట్ట వేసే చర్యలు, సున్నితమైన, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పోలీస్ శాఖ తీసుకోవాల్సిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు. రానున్న ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపించేలా అన్నిరకాల ముందస్తు చర్యలు చేపట్టాలని వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి ఎన్నికలు పూర్తిస్థాయిలో ముగిసే వరకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాల్సిన వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, కనిగిరి డీఎస్పీ రామరాజు, మార్కాపురం డీఎస్పీ వీర రాఘవరెడ్డి, దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావుతోపాటుసీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం



అగ్నికీలల్లో గృహాలు

పుల్లలచెరువు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పూరి గుడిసెలు అగ్నికి ఆహుతైన సంఘటన పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కల్లకుంట గోవింద్, యమున పూరి గుడిసెల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో గృహాల్లోని పొలం తాలుకా పత్రాలు, 5 తులాల బంగారం, 5 తులాల వెండితో పాటు దుస్తులు, వంట సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక శకటం వచ్చేలోగా నష్టం జరిగిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమ్మె విరమించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

- రేపటి నుంచి విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించిన ఉద్యోగుల జేఏసీ



విలేకరులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు

ఒంగోలు టౌన్: గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో శనివారం నుంచి విధుల్లోకి చేరుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శి కళ్యాణి, అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. గురువారం దీక్షా శిబిరం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సమ్మతించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నవంబరు 20వ తేదీ నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, బుధవారం రాత్రి జరిగిన చర్చలతో మంత్రి బొత్స సత్యనారాయణతోపాటుగా రాష్ట్ర స్థాయి అధికారులు పలువురు పాల్గొన్నారని, హెచ్ఆర్పీ పాలసీకి ఎస్ఎస్ఏ, జీఏడీ ఫైనాన్స్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారని వెల్లడించారు. అలాగే 2017 నుంచి వేతనాలు పెరగని వారికి 23 శాతం వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయనున్నారని, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌ని ఒకేషనల్ టీచర్‌గా మారుస్తున్నట్లు తెలిపారు. పీఎఫ్‌పై సానుకూలంగా స్పందించారని చెప్పారు. సీఆర్ఎంటీలను క్లస్టర్ పరిధిలో ఉంచి సీఆర్టీగా మార్చనున్నారని, కారుణ్య నియామకాలు చేపట్టడంతోపాటు సమ్మెలో తొలగించిన ఉద్యోగులను తిరిగి నియమించడం, సమ్మె కాలానికి వేతనం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు వివరించారు. నిరవధిక సమ్మెకు సహకరించిన ఉపాధ్యాయ సంఘాలకు, ఉద్యోగ, కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి, ఇతర అధికారులను కలిసి రేపటి నుంచి విధులకు హాజరుకానున్నట్లు సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు తెలిపారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



క్విస్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో రవాణా శాఖ ఉప కమిషనర్ సుశీల

ఒంగోలు: స్థానిక రవాణా శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో ఇంజినీరింగ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజేషన్ విద్యార్థులకు రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్ర నిర్వహించింది. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ.. రహదారి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మాత్రమే ప్రమాదాల సంఖ్యను నియంత్రించగలమన్నారు. ఒక ప్రమాదం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కుటుంబాల ఆర్థిక స్థితిని, జీవన ప్రమాణాలను దారుణంగా దెబ్బతీస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రమాదాలు గొడ్డలిపెట్టులాంటివన్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, అధికారులతోపాటు యువత సహకారం అవసరమన్నారు. ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి, భద్రతపై ప్రభుత్వాలు పదే పదే ఎందుకు ప్రచారం చేస్తున్నాయనే అంశాలపై ప్రజలను చైతన్యం చేయడంలో యువజన కేంద్రాలతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విస్తృతంగా కృషి చేయాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించిన సూచికల గురించి వివరించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు శిక్షణ ప్రారంభం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 కబడ్డీ శిక్షణా శిబిరాన్ని గురువారం ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ నెల 24న జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల పీడీ, కబడ్డీ జట్టు కోచ్ ఎం.బాలగురవయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు పాఠశాలల నుంచి ఎంపికైన 20 మంది క్రీడాకారులకు 10 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పీఈటీలు సుఖునాభి, కోటేశ్వరి, వనజలత పాల్గొన్నారు.



కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు